# చిన్న కోరిక

"అంకుల్! మీకు అభ్యంతరం లేకపోతే నేను మీ అమ్మాయితో ఒక్క పదినిముషాలు ఏకాంతంగా మాట్లాడతాను!" రాజేంద్ర అన్నాడు.

సచ్చిదానందమూర్తి నవ్వుతూ, "అభ్యంతరం దేనికి... వెల్‌కమ్!" అంటూ సోఫాలోనుంచి లేచాడు.

వాళ్ళు అరగంటయింది వచ్చి. కులాసాగా కబుర్లు చెప్పుకున్నారు. టిఫెన్లు తిని కూల్‌డ్రింక్స్ త్రాగారు. వాళ్ళ వివరాలు, వీళ్ళ వివరాలు పూర్తిగా చెప్పుకున్నారు.

"మేం అంతా పక్క గదిలో కూర్చుంటాం... మీరు మాట్లాడుకోండి!"

సచ్చిదానందమూర్తి కూతురు స్పందనను చూడటానికి వచ్చిన రాజేంద్ర, ఆ అమ్మాయి రూపం నచ్చటంతో మరో అడుగు ముందుకు వేసి తన కోరికను ఆమె తండ్రికి చెప్పాడు.

"మనం ఇంతమందిమి లేచి వెళ్ళేదానికంటే వాళ్ళనే ఆ పక్కగదిలో కూర్చొని మాట్లాడుకోమనండి!" అన్నాడు రాజేంద్ర తండ్రి- అది చాలా మామూలు విషయం అన్నట్లుగా నవ్వుతూ.

తరువాత అయిదు నిముషాలల్లోనే రాజేంద్ర, స్పందన పక్క గదిలో చెరో కుర్చీలో ఎదురెదురుగ్గా కూర్చున్నారు. మధ్యలో టీపాయ్ మీద స్పందన అక్కయ్య రెండు గ్లాసులతో చల్లటి రస్నాను పెట్టి కర్టెన్ లాగి వెళ్ళిపోయింది.

స్పందనకు ఇబ్బందిగా వున్నది అతడి ఎదుటున అలా వంటరిగా కూర్చోవడం- ఏం వుంటుంది, అంత ఏకాంతంగా మాట్లాడేటందుకు- అన్నట్లు ముఖం కాస్త చిట్లించి కూర్చున్నది.

"అన్ని వారాల్లోకి మీకు ఏ వారం యిష్టం?" అన్నాడు మొట్టమొదటి సారిగా రాజేంద్ర నోరు తెరిచి.

'ఏంవిటీ పిచ్చిప్రశ్న?' అన్నట్లుగా తలెత్తి చూసింది అతడి వంక ఒక్క క్షణం. తరువాత, "గురువారం!" అన్నది.

"సాయిబాబానా?"

"రాఘవేంద్రస్వామి గూడా!"

"మీరు ఆ రోజు ఉపవాసం ఉంటారా?"

"ఒక్క పూట భోజనం చేస్తాను... రెండో పూట టిఫెన్!"

"ఐసీ... ఓకే!... అయితే నన్ను గూడా అలాంటి నియమాలు పాటించమని అడగరు గదా!" అన్నాడు చిన్నగా నవ్వి రాజేంద్ర.

"నా నమ్మకాలను మరొకరి మీద రుద్దటం వలన నాకు వచ్చే లాభమేముంటుంది?" అన్నది స్పందన చిన్నగా నవ్వి.

"అమెరికాలో నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీరును... నాలుగేళ్ళబట్టి అక్కడ పని చేస్తున్నట్లుగా మీకు తెలుసుగదా...?"

'తెలుసు' నన్నట్లుగా తల ఊపింది స్పందన.

"మీరు పోస్ట్‌గ్రాడ్యుయేట్... మీకు తగిన ఉద్యోగం అక్కడ దొరికితే చేయటానికి అభ్యంతరమేమైనా వున్నదా?"

"అవసరమా?"

"డబ్బు చేదుకాదు గదా! ఆ పైన ఒంటరిగా ఇంట్లో కూర్చోవటానికి బోరుగూడా కొట్టవచ్చు!"

ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగి, "చేస్తాను!" అన్నది.

"గుడ్!"

నున్నటి గడ్డాన్ని చేత్తో రుద్దుకుంటూ, "మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు... అసలు ఇలా మనం మాట్లాడు కోవటంలో వుద్దేశ్యం... ఒకళ్ళ అభిరుచులు, కోరికలు, ఆశయాలు మరొకరు తెలుసుకోవటం వలన ముందు ముందు అభిప్రాయభేదాలు రాకుండా వుంటయ్యని..."

స్పందన విని నవ్వి ఊరుకున్నది.

"నాకు సిగరెట్ త్రాగటం అలవాటున్నది!" అన్నాడు ఆత్రంగా– అందమైన స్పందన ముఖంలో మార్పేమైనా వస్తుందా అన్నట్లుగా గమనిస్తూ.

కాస్త చికాకు పడింది– అతడి మాటకు స్పందన.

"మీరు బయట త్రాగితే నేను ఆపలేను గదా!" అన్నది నవ్వుతూ.

అతడు పెద్దగా నవ్వాడు. "అంటే మీ ఎదుటున త్రాగటానికి వీల్లేదంటారు. అంతేనా?" అన్నాడు.

కాస్త తడబడింది స్పందన.

"అలా అని కాదు..."

"ఓకే... ఓకే... లీవిట్!..."

"అక్కడ మనుష్యులు చాలా కలివిడిగా తిరుగుతుంటారు... మన వాళ్ళకు ఆ వాతావరణం కాస్త ఇబ్బందిగా వుంటుందేమో... మీరు ఎడ్జస్ట్ అవ్వగలుగుతారా?"

అతడి ముఖంలోకి కన్పడకుండా ఒక్కక్షణం చూచింది.

"అంటే?"

అతడు ఎలా చెప్పాలా అన్నట్లుగా కాస్త సంశయంగా అటూ యిటూ కదిలాడు.

"వీకెండ్‌లో పిక్నిక్‌కు వెళ్ళాం అనుకోండి ఫ్రండ్స్‌తో... అక్కడ మగా, ఆడా తేడా లేకుండా భుజాలు భుజాలు రాసుకుంటూ మాట్లాడుకోవటాలు... చేతులూ చేతులూ కలుపుకోవటాలు... డాన్స్ చేయటాలు... జస్ట్ సరదాగా... ఫన్నీగా వుంటుంది!" అన్నాడు కళ్ళు చికిలించి ఆమె పెద్దపెద్ద కళ్ళనే చూస్తూ నవ్వుతూ.

"ఇబ్బందిగా వుండదా... ఈ వాతావరణంలో పెరిగిన మనకు!"

"పుట్టినప్పుడు గుడ్డలు లేకుండా పుట్టాం... ఆ తరువాత చిన్న లాగులూ, చొక్కాలు... గౌన్లు... పరికిణాలు... ఓణీలు... చీరలు... పంజాబీ డ్రస్సులు... చుడీదార్లు... రోజు రోజుకూ మారిపోతున్నాం... అక్కడి వాతావరణం అది!"

"ఇక్కడనుండి వెళ్ళిన అందరూ అలాగే వుంటారా?"

"జీవితాన్ని అనుభవించాలీ అంటే అలాగే వుంటారు!"

స్పందన నవ్వింది.

"అనుభవించటమంటే?"

"ఎంజాయ్ చేయటం!" అతడు ఒక్క క్షణం గూడా ఆలస్యం చేయలేదు.

ఆమె క్షణం తలవంచుకున్నది. ముఖమంతా ఎర్రగా కందినట్లవ్వగా "సపోజ్... సపోజ్... మన వివాహం అయిం తరువాత మీతో అమెరికా వచ్చాననుకోండి... నేను అలా చేయటం మీకిష్టమేనా?" అన్నది.

"నాకు జీవితాన్ని ఎంజాయ్ చేయటం అంటే బహు ఇష్టం!"

అతడి ఆనందాన్ని కళ్ళార్పకుండా చూస్తూ వుండిపోయింది కొద్ది క్షణాలు స్పందన.

"అక్కడ పరిచయమైన వాళ్ళంతా... బాబ్ చేయించుకొని... మిడ్డీస్ వేసుకుంటే..."

"నేను మాత్రం చీర కట్టుకొని వాళ్ళ మధ్య జంతువులా ఎలా వుంటాను చెప్పండి!" అన్నది పెద్దగా నవ్వుతూ.

"అరె... ఫైన్!"

"నేను అప్పుడప్పుడూ..." నసుగుతున్నట్లుగా ఆగాడు.

"చెప్పండి... మొహమాటం దేనికి?" అన్నది ఓరగా అతడి ముఖంలోకి చూస్తూ.

"ఫ్రండ్స్‌తో కలసి డ్రింక్ చేస్తాను... వాళ్ళ పార్టనర్స్‌కూడా కొందరు డ్రింక్ చేస్తుంటారు... ఆ వాతావరణానికి అది బాగుంటుంది... కొన్ని గంటలు మేము అన్నీ మరిచిపోయి ఆనందిస్తుంటాం!"

స్పందన మాట్లాడలేదు కొద్దిసేపు. ఆపైన నిర్ణయానికి వచ్చిన దానిలా తలెత్తి, "నేను మీకు అభ్యంతరం చెప్పను!" అన్నది.

అతడు ఉత్సాహంగా ముందుకు వంగాడు. "అదే నేనూ అనేది... నేనూ మిమ్మల్ని మాతో కలవమని ఒత్తిడి చేయను... మీ అంతట మీరు ముందుకు రాకపోతే!"

"థాంక్యూ వెరీ మచ్!"

అతడు రస్నా గ్లాసు అందుకొని రెండు చేతుల మధ్యా పెట్టుకొని అటూయిటూ తిప్పుతూ, "మీ ఇష్టాలూ, కోరికలూ... నేను తెలుసుకోవచ్చా?" అడిగాడు.

స్పందన నవ్వింది. "ఆడదానికి ఇష్టాలూ, కోరికలూ అంటూ ఏం వుంటయ్యండీ... కళ్ళు మూసుకొని భర్త అడుగుజాడల్లో నడవటమే!"

"కోపంతో అంటున్నారా ఆమాట!" కాస్త అనుమానంగా ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు రాజేంద్ర.

"ఛ! ఛ! మీరు అంత ఫ్రాంక్‌గా మాట్లాడుతున్నప్పుడు కోపం దేనికి... ఒక విధంగా నేను మిమ్మల్ని ప్రశంశిస్తున్నాను... ఈ గడ్డ మీద సుమతి కుష్టురోగి కీశికుడిని బుట్టలో పెట్టుకు మోస్తూ అతడి కోరికలన్నీ తీర్చింది... ఆ రక్తం భారత స్త్రీలో వున్నదనే విషయం మీకు తెలియదా?" అన్నది చాలా తేలిగ్గా నవ్వుతూ.

"అఫ్‌కోర్స్... అఫ్‌కోర్స్..." అన్నాడు ఆనందంగా గూడలెగరేస్తూ.

"మీరు నన్ను చాలా ఎన్‌లైట్ చేశారు... ఇక వెళ్దామా?" అన్నది లేవబోతూ.

"ఒక్క నిముషం!" ఆగాడు. "చిన్న విషయం... తరువాత అపార్థాలు రాకుండా వుండాలని నా ఉద్దేశ్యం... అది చెప్పేసి... ఇప్పుడే ఇక్కడే ఈ వివాహానికి నా అంగీకారం తెలియబరిచేస్తాను. మిగతా విషయాలు పెద్దవాళ్ళు మాట్లాడుకుంటారు!"

"గుడ్... నాన్చుడు నాకూ ఇష్టం లేదు... నేను నచ్చానా లేదా అని లేనిపోని టెన్షన్ నాకు మాత్రం దేనికి... ప్లీజ్... అడగదల్చుకున్నదేదో అడిగేసేయండి!"

"మా కంపెనీ రిసెప్షనిస్ట్ విజ్జీ వున్నది... ఆ దేశస్థురాలే... వెరీ స్మార్ట్... నేనంటే పడి చస్తుంది... అప్పుడప్పుడూ పార్టీలు చేసుకుంటుంటాం... అదేం శాశ్వత బంధంకాదు... జస్ట్ ఫర్ చేంజ్... కలిసి తిరుగుతుంటుంటాం... అక్కడ ఎవ్వరూ పట్టించుకోరు గూడా... ఇప్పుడు ఎందుకు చెబుతున్నానంటే... తరువాత అక్కడ ఎవ్వరైనా ఈ విషయం మీ ముందు ఎత్తినప్పుడు అనవసరంగా ఆపోహలు లేకుండా... ఓకే... దట్సాల్!" అన్నాడు హాయిగా నవ్వేస్తూ.

ఆమె ఒక్కసారి రిలీఫ్‌గా తేలిగ్గా నవ్వింది 'ఓస్ ఇంతేనా' అన్నట్లుగా.

స్పందన లేస్తూ, "నేను ఇందాకే చెప్పాను గదా... మీ ఫ్రాంక్‌నెస్ నాకు బాగానచ్చింది... దట్స్ గుడ్!" అన్నది– తన పెద్ద కళ్ళను మూసి తెరుస్తూ.

"థాంక్యూ!"

"మరి ఇక వెళ్దామా... అక్కడ మనకోసం అంతా ఎదురు చూస్తుంటారు!" అన్నది స్పందన.

"ష్యూర్... కాని, మీరు మీ సైడ్ నుంచి నన్నేం అడగనే లేదు!"

ఆమె అతడినే చూస్తూ వుండిపోయింది కొద్ది క్షణాలు. "ఆడవాళ్ళకు ఏముంటయ్యండి పెద్ద కోరికలు- అందునా మీలాంటి విశాల హృదయుల ముందు అవి ఏపాటి... ఎడ్జస్టు అయిపోవడమే!"

రాజేంద్ర హుషారుగా లేచాడు. "అలా కాదు... నేను ఎంత ఫ్రాంక్‌గా చెప్పానో నా భావాలు... మీరు అంత ఫ్రాంక్‌గా మాట్లాడితే నేను చాలా ఆనందిస్తాను!" అన్నాడు ఆమెకు దగ్గరగా ముందుకు ఓ అడుగు వేసి.

"చాలా చిన్నకోరికండీ నాది!"

"చిన్నదైనా... పెద్దదైనా చెబితే నాకూ సంతోషమే గదా!" అన్నాడు అంత చిన్న కోరికను తను మాత్రం ఎందుకు కాదంటాడు అన్నట్లుగా.

"నాకు చిన్న పిల్లలంటే ఇష్టమండీ!" అన్నది- 'చెప్పక తప్పదా' అన్నట్లుగా ఒక్కసారి అతడి ముఖంలోకి చూచి.

"నాకూనూ..."

"అందునా బంగారపు రంగులో వున్న పిల్లలంటే - ఎవ్వరి చంకన వున్నా సరే తీసుకొని ఎత్తుకుంటాను!"

"ఏ గుడ్ టేస్ట్..." మెచ్చుకుంటున్నట్లుగా ఆమెనే చూస్తూ అన్నాడు రాజేంద్ర.

"అలాంటి పిల్లలు నాకూ కావాలని కోరిక... ఆ కోరిక తీర్చుకోవటానికి నా ప్రయత్నాలు నేను చేసుకుంటే మీకు అభ్యంతరం వుండదనుకుంటాను!" అన్నది- తనలో అప్పటి వరకూ గూడు కట్టుకున్న కసినంతా- అతడి నల్లటి ముఖం మీద కుమ్మరిస్తున్నట్లుగా - చూస్తూ!

* * *

*(రచన: నవంబరు, 2000)*